క్లుప్తంగా

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జేష్ఠమాసం నాల్గవ శనివారం సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చిన్నగురువళూరులో వైఎస్సార్ కంటి వెలుగు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు తేజ

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువళూరు గ్రామ సచివాలయం వద్ద శనివారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎంఎస్ తేజ గ్రామంలోని వృద్ధులు, కంటి సమస్యలున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యుడు ఎంఎస్ తేజ మాట్లాడుతూ ఆపరేషన్లు, కంటి అద్దాలు అవసరమైన వారిని గుర్తించామని వైఎస్సార్ ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులలో ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కంటి అద్దాలు అవసరమైన వారికి ప్రభుత్వం నుంచి అద్దాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా నిర్వహించండి



రికార్డులను పరిశీలిస్తున్న సీహెచ్ఓ మహేదేవ్

చాపాడు : ప్రతి గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు వేసే టీకా నమోదు రికార్డులను పక్కాగా మెయింటెనెన్స్ చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మహదేవ యాదవ్ అన్నారు. మండలంలోని పల్లవోలు, అల్లాడుపల్లె గ్రామ సచివాలయాల పరిధిలోని వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ కేంద్రాలను శనివారం సీహెచ్ఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు విలేజ్ క్లీనిక్‌లలోని రికార్డులను పరిశీలించారు. సీహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి విలేజ్ క్లీనిక్‌లో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు అందుబాటులో ఉండాలని, రికార్డులను తప్పకుండా నమోదు చేయాలన్నారు. నిత్యం గ్రామాల్లో తిరుగుతూ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు



కథలు చదువుతున్న విద్యార్థులు

దువ్వూరు : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా శనివారం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి శ్రీనివాస రావు పేర్కొన్నారు. కథల పోటీలు అనంతరం రిటైర్డు ఉపాధ్యాయుడు స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్‌లో మెళకువలు నేర్పించారు. అనంతరం విద్యార్థులకు క్యారంబోర్డు, చెస్ పోటీలు నిర్వహించారు.

13న ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13న మంగళవారం ఉదయం 11.30 గంటలకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఈ జి.శ్రీనివాసుల రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ఎస్ఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌తో పాటు డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొంటారన్నారు. సమస్యలను రాతపూర్వకంగా తెలియజేయవచ్చని తెలిపారు.

ఇళ్ల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన ఇళ్ళ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రతిఒక్క లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు కోరారు. ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన గృహాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఆకుల వెంకటరమణతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బద్వేలు పట్టణంలో సుమారు 25 వేల గృహాలు ఉండగా అందులో 11461 గృహాలను క్రమబద్ధీకరణ చేసేందుకు అధికారులు గుర్తించారని వివరించారు. ఇందులో సబ్ డివిజనల్ కమిటీ విచారణ ద్వారా క్రమబద్ధీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించుకున్న గృహాల క్రమబద్ధీకరణ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. విచారణలో సిద్ధం చేసిన జాబితాను ఆయా సచివాలయాల్లో, తహసీల్దారు కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రచురించడం జరుగుతుందని, అభ్యంతరాల సమీక్ష అనంతరం లబ్ధిదారుని గుర్తింపు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్రమబద్ధీకరణ ప్రక్రియ ముగిసిన తర్వాత గతంలో ఉన్న రికార్డులను కూడా రద్దు చేసి నూతన డిజిటలైజ్డ్ రికార్డు సిద్ధం చేస్తామని, తద్వారా అవకతవకలకు చోటు ఉండదని తెలిపారు. ఈ క్రమబద్ధీకరణ కార్యక్రమంలో రెండు సెంట్లలోపు నిర్మాణం చేసుకున్న వారికి ఉచితంగా డీకేటీ పట్టా రెగ్యులరైజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు నుంచి నాలుగు సెంట్లు లోపు ఉన్న ఇళ్ళ నిర్మాణాలకు మార్కెట్ విలువలో 50 శాతం ధర డీడీ రూపంలో చెల్లిస్తే వాటిని కూడా రెగ్యులరైజ్ చేస్తామన్నారు. నాలుగు నుండి ఆరు సెంట్లు లోపు ఇళ్ళ నిర్మాణాలకు మార్కెట్ విలువకు సమానం, 6 నుండి 10 సెంట్లలోపు ఇళ్ళ నిర్మాణాలకు మార్కెట్ విలువలో 1.5 రెట్లు ధరతో క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. చెరువులు, వంకపోరంబోకు, రహదారులు, శ్మశానాలు వంటి ఆక్షేపణ గల భూముల్లో నిర్మించిన గృహాలకు ఈ పథకం వర్తించదని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, జెడ్పీటీసీ పోలిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, ఆయా మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు అహర్నిశలు శ్రమించాలి



డాక్టర్ రాణిసుస్మితను సన్మానిస్తున్న ఆర్డీఓ, వైవీయూ డీన్

బద్వేలు అర్బన్ : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు అహర్నిశలు శ్రమించాలని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ సూచించారు. రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ లక్ష్యాలతో కష్టపడి చదివి ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. గ్రూప్–1 మొదటి ర్యాంకర్ డాక్టర్ రాణిసుస్మిత (ట్రైనీ డిప్యూటీ కలెక్టర్–విశాఖపట్నం), గ్రూప్–2 రెండవ ర్యాంకర్ కె.శ్రీనివాసులు (ట్రైనీ డిప్యూటీ కలెక్టర్–బద్వేలు)లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి స్వయంకృషి, ఏకాగ్రత, పట్టుదల చాలా అవసరమని, అలాగే పోటీతత్వం, సమయపాలన కూడా ముఖ్యమన్నారు. గ్రూప్–1 పదకొండవ ర్యాంకర్ రమణకాంత్ (ట్రైనీ డిప్యూటీ కలెక్టర్–కడప) మాట్లాడుతూ విద్యార్థి దశలో ఆరోగ్యకరమైన స్నేహ వాతావరణం పెంపొందించుకోవాలని సూచించారు. యోగివేమన విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు మాట్లాడుతూ సంపాదన ముఖ్యం కాదని, సద్గుణాలు ముఖ్యమని వివరించారు. అనంతరం డిగ్రీ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు. అలాగే ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వి.వి.చలపతి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీ జెండాలు తొలగించిన వారిపై చర్య తీసుకోవాలి

పోరుమామిళ్ల : మండలంలోని ఇందిరానగర్‌లో బీజేపీ జండాలు తొలగించిన వారిపై చర్య తీసుకోవాలని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉట్టి శ్రీనివాసులు అధికారులను కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మోదీ ప్రధాని పదవి చేపట్టి 9 సంవత్సరాలైన సందర్భంగా మే 18 నుంచి జూన్ 30 వరకు చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా కాలువకట్ట ఇందిరానగర్‌లో జండాలు కట్టారన్నారు. వాటిని తొలగించడం మంచిది కాదని, వారిపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

వెంకటేష్ స్పైన్ హాస్పిటల్ ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ దంపతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నెహ్రూరోడ్డులో మానస నర్సింగ్‌హోంలో శనివారం వెంకటేష్ స్పైన్ హాస్పిటల్‌ను డాక్టర్ కదిరి వెంకటేష్ దంపతులు ప్రారంభించారు. ఈయన జపాన్‌లోని ఒకాయమ రోసల్ హాస్పిటల్‌లో ఫెలోషిప్ ఏట స్పైన్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు. బెంగళూరులోని ఆర్ఆర్ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా మూడేళ్లు సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రముఖ నగరాల్లో లభించే ఖరీదైన వెన్నముక సమస్యల సర్జరీలను ప్రొద్దుటూరు పట్టణంలో తక్కువ ఖర్చుతో చేస్తామన్నారు. వెన్నుజారుట, ఫ్యాక్చర్, వెన్నముక వంకర్లు, సరికాని వెన్నముక సమస్యలను అత్యాధునిక పరికరాలతో చికిత్స చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కుటుంబ సభ్యులు, డాక్టర్లు లక్ష్మినరసయ్య, వరలక్ష్మి, ప్రమీలా రంగారెడ్డి, త్యాగరాజరెడ్డి, నాగదస్తగిరిరెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ నిర్మాణానికి భూమి పూజ

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్జీఓ కాలనీలో రూ.13లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్జీఓ కాలనీ అభివృద్ధికి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీ పరిధిలోని జేమ్స్‌పేట, సుందరయ్య నగర్ వాసుల కోసం శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రాజేశ్వరికాలనీ, వైట్ హౌస్ వద్ద డ్రైనేజీ కాలువలను నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం పంచాయతీలో ఐదు చోట్ల రూ.1.5 కోట్ల పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, ప్రొద్దుటూరు లారీ సోసియేషన్ అధ్యక్షుడు వేంపల్లె సురేంద్రనాథ్‌రెడ్డి, పుల్లయ్య, మోహన్‌రెడ్డి, వార్డు మెంబర్ తిరుపాల్‌రెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే



మాట్లాడుతున్న జడ్జి ఎం.ప్రదీప్ కుమార్

ఖాజీపేట : వృద్ధాప్యం వచ్చిన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే అని లేని యెడలా వారి శిక్షార్హులని కడప అడిషనల్ సివిల్ జడ్జ్ ఎం.ప్రదీప్ కుమార్ అన్నారు. ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లె పంచాయతీలోని పునీత్ లార్సెన్స్ వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వృద్ధులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం – 2007 ఏపీ తల్లిదండ్రులు వయోవృద్ధుల చట్టం – 2011 లోని నియమాలను వారికి వివరించారు. తల్లిదండ్రులను వదిలేసిన, వెళ్లిపోవాలని వేధించిన, వారిపై దాడులు చేసిన శిక్షార్హులని అన్నారు. మూడు నెలల జైలు శిక్ష లేదా అపరాధరుసుము, లేదా రెండూ కలపి విధిస్తారన్నారు. కడప జిల్లాలో మూడు ట్రిబ్యూనల్స్ ఉన్నాయని తెలిపారు. కడప రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, రాజంపేట, జమ్మలమడుగు అలాగే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. 14567 టోల్ ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికారి సంస్థ దృష్టికి తీసుకురావచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు చెన్నయ్య, పారా లీగల్ వలంటీర్ అరుణకుమారి, వృద్ధాశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేయడం తగదు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అధిక ఫీజు లు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ విభాగ కన్వీనర్ కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశా రు. ఈ విషయమై శనివారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల రూపంలోనే కాకుండా యూని ఫాం పేరుతో విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించాలని కోరారు.

నేడు తొగట విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు తొగట వీరక్షత్రియ విద్యార్థులకు 11వ వార్షిక ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ తెలిపారు. శనివారం కళ్యాణ మండపంలో శ్రీచౌడేశ్వరి తొగట వీరక్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. పదవ తరగతి, ఇంటర్‌లలో అత్యధిక మార్కులు సాధించిన తొగట విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈ గంజికుంట వెంకటరమణ, కళ్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, గౌరవాధ్యక్షుడు పట్టుపోగుల పుల్లయ్య, జనరల్ సెక్రటరీ పల్లా శేషయ్య తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు ఉమ్మడిశెట్టి చౌడయ్య, చౌడం వెంకట రమణ, గంజికుంట ఆంజనేయులు, కె.రమేష్, వెంకటరామయ్య, లక్ష్మినారాయణ, రమణ పాల్గొన్నారు.

బ్రౌన్ కేంద్రానికి 1100 పుస్తకాలు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ కేంద్రానికి బయటి ప్రాంతాల నుంచి పుస్తకాలు చేరుతూనే ఉన్నాయి. శనివారం 1100 పుస్తకాలను బ్రౌన్ కేంద్రం సిబ్బంది సేకరించారు. హైదరాబాదులోని దూరదర్శన్ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు 500 పుస్తకాలు, ప్రముఖ సాహితీవేత్త, నటుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ 200, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మనాభరెడ్డి 200 పుస్తకాలు, విశ్రాంత తెలుగు రీడర్ డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ 200 పుస్తకాలు వెరిసి మొత్తం 1100 పుస్తకాలను బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథ పాలకులు జి.హరిభూషణరావు, సహాయకులు నీలకంఠేశ్వర్‌లకు అందజేశారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం



నియామకాలు అందుకున్న మోర్చా ప్రతినిధులతో బీజేపీ నాయకులు

మైదుకూరు : కేంద్రంలో బీజేపీ 9 ఏళ్లలో సంక్షేమ పాలన అందించిందని ఆ పార్టీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లెల శ్రావణ్ కుమార్ రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు తెలిపారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో అన్ని మోర్చాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఆహార భద్రత, మహిళా సంక్షేమం కోసం నూతన విధి విధానాలను ప్రవేశపెట్టిన మోడీ సత్ఫలితాలను సాధించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం బీజేపీ ఎంతో సహకారం అందించిందని తెలిపారు. సమావేశంలో మైదుకూరు మండల యువ మోర్చా అధ్యక్షుడిగా మృదంగం కిశోర్ కుమార్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా చెన్నకేశవులు, ఖాజీపేట మండల యువ మోర్చా అధ్యక్షుడిగా ఆర్.సాయిరాం, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయరెడ్డిలను నియమించారు. కార్యక్రమంలో మైదుకూరు మండల బీజేపీ అధ్యక్షుడు ఆర్.రామకృష్ణ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య, చంద్రబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు చిత్ర కవితా సౌరభం పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అలంకారం వెంకట రమణరాజు రచించిన చిత్ర కవితా సౌరభం పుస్తకావిష్కరణ సభ చిత్ర సాహితీ ప్రచురణలు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కార్యక్రమ నిర్వాహకులు అలంకారం విజయ్‌కుమార్, ఆదిత్యకుమార్‌లు ఈ మేరకు వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా హైదరాబాదుకు చెందిన చింతా రామకృష్ణారావు, ఏలూరుకు చెందిన కందుల నాగేంద్ర వరప్రసాద్ పాల్గొంటారన్నారు. ప్రత్యేక అతిథిగా బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి వ్యవహరిస్తారని, యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం అధ్యాపకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పుస్తకాన్ని సమీక్షిస్తారని, అవధాని, నాటక రచయిత ఎంవీఎల్ఎన్ ప్రసాద్, సాహితీవేత్త జీవీ సాయిప్రసాద్‌లు పాల్గొంటారని తెలిపారు.

షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాజగోపాల్



మాట్లాడుతున్న చల్లా రాజగోపాల్

ప్రొద్దుటూరు కల్చరల్ : షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా చల్లా రాజగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం సాయంత్రం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో కడప జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా చల్లా రాజగోపాల్, కార్యదర్శి అనిల్ కుమార్, కోశాధికారి శౌరికుమార్, ఉపాధ్యక్షులుగా మమత, ఇమ్మానుయేల్, సంయుక్త కార్యదర్శిగా దేవేంద్ర, సభ్యుడిగా సురేష్‌కుమార్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురాముడు, గంగిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్కటవేముల గ్రామస్తులకు పరామర్శ



అస్వస్థతకు గురైన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజుపాళెం మండలం అర్కటవేముల గ్రామస్తులను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం పరామర్శించారు. గురువారం రాత్రి ఎస్సీ కాలనీలో జరిగిన ఓ శుభకార్యక్రమంలో గుగ్గిళ్లు తిని 27 మంది అస్వస్థతకు గురయ్యారు. అందరూ వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబుతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అందరూ కోలుకుంటారని, ఇందుకు అవసరమైన చికిత్సను డాక్టర్లు అందిస్తారని ఎమ్మెల్యే వారితో అన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధి వెంకటరమణారెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, కోటా శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ కార్యక్రమానికి బంధువులు తెచ్చిన అలసంద గుగ్గిళ్లను తిని 27 మంది వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పితో బాధపడుతూ ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో వారిని, గ్రామంలోని బంధువులను శనివారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ వల్లి పరామర్శించారు. అందరికీ బాగా అయ్యే వరకు గ్రామంలో వైద్యశిబిరం కొనసాగించాలని ఆయన మండల వైద్యులు మంజుల, నిఖిలకు సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ, ఖాజామొద్దీన్, ఎంపీహెచ్ఈఓ రవిశంకరరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బి.ఎస్.నారాయణరెడ్డికి సేవారత్న అవార్డు



హైదరాబాద్‌లో సేవారత్న అవార్డును అందుకుంటున్న బి.ఎస్.నారాయణరెడ్డి

కాశినాయన : ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా టీచర్, సంఘ సేవకులు బి.ఎస్.నారాయణరెడ్డికి హోలీప్రిన్స్ విద్య, వైద్య, ఆధ్యాత్మిక, సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు కె.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో భారత ఉత్తమ సేవారత్న అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణరెడ్డి పలు సంఘ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ దాతలతో విరాళాలు సేకరించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. అంతేకాకుండా యువతకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ, దాతల సహకారంతో తల్లి, తండ్రి లేని విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సమాగ్రి అందజేయడం, అభాగ్యులకు భోజనాలు, బట్టలు అందించడం, అనాథశవాలకు అంత్యక్రియలు నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో షేక్ షమీరా, బలగం సినీ నటులు సహదేవ్, సుబ్రమణ్యం, దీక్షితులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ సారథి కుమార్తె పెళ్లి కోసం రూ.10 లక్షల బాండు ఇస్తా



నగదు అందిస్తున్న సుధాకర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెద్దశెట్టిపల్లె గ్రామ సచివాలయ గృహసారథి ఎస్.దస్తగిరి కుమార్తె పెళ్లి కోసం రూ.10లక్షలు బాండు ఇస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. పిల్లలు పెద్ద అయ్యేంత వరకు పోషించేందుకు తాను ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుంటానన్నారు. మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన దస్తగిరి ఇంటికి శనివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వెళ్లారు. దస్తగిరి సతీమణి వలంటీర్ మెహరాజ్‌ను పరామర్శించారు. దస్తగిరికి ముగ్గురు చిన్న పిల్లలేనని, వారిని ఉన్నత చదువులు చదివించాల్సిన అవసరం ఉందన్నారు. జరిగిన సంఘటన గురించి బాధపడకుండా పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. కుమార్తె పెళ్లి నాటికి రూ.10లక్షలు వచ్చేలా బాండు ఇస్తానని అన్నారు. ఈ సందర్భంగా రూ.2 లక్షల నగదును ఎమ్మెల్యే వారికి అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండాత్మకూరు సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, రాయలసీమ పోలీసు కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవండి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ

పోరుమామిళ్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు అండగా నిలిచి జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ కోరారు. శనివారం పోరుమామిళ్ల మండలంలోని కొత్రపాటిపల్లె పంచాయతీ పరిధిలోని దుగ్గాయపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుండి అందిన సంక్షేమ పథకాలు, లబ్ధిని గ్రామస్తులకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలను గమనించి వారి అభివృద్ధికి హామీలుగా ఇచ్చిన సంక్షేమ పథకాలన్నింటిని తమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. నవరత్నాలతో ప్రతిఒక్కరు ఆర్థికాభివృద్ధి సాధించేలా అండగా నిలిచామన్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామాలకే పాలనను తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, వైస్ ఎంపీపీలు సి.ఎం.బాషా, చెన్నురాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాష్‌రెడ్డి, దుగ్గాయపల్లె సర్పంచ్ రాజారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి ఖాసీం పీరా, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ నూతన గృహప్రవేశం



రమేష్‌యాదవ్ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు

ప్రొద్దుటూరు కల్చరల్ : హైదరాబాదులోని తుక్కుగూడలో శనివారం పట్టణానికి చెందిన ఎమ్మెల్సీ ఆర్.వి.రమేష్‌యాదవ్ నూతనగృహ ప్రవేశం అట్టహాసంగా జరిగింది. రమేష్ యాదవ్ దంపతులు ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతోపాటు తెలంగాణ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రఘురామిరెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే వెంకటగౌడ్, ఎమ్మెల్సీలు వంశీయాదవ్, భరత్, మాధవ్, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మేయర్ సురేష్‌బాబు, వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి, స్థానిక కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొని రమేష్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

విచారణ పూర్తయ్యాకే ఏపీజీఈఏ లెటర్స్‌ను పరిశీలించాలి

కడప రూరల్: జరగబోవు సాధారణ బదిలీలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ పూర్తయ్యాకే ×ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ)₹ లెటర్స్‌ను పరిగణలోకి తీసుకోవాలని ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆదాల వెంగల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మేసా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ బదిలీలకు సంబంధించి గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల నుంచి ఆఫీస్ బేరర్స్‌కు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఏపీజీఈఏ వారు ఆఫీస్ బేరర్స్‌గా అసోసియేషన్‌లో పనిచేయకపోయినా లేదా సభ్యత్వం లేకపోయినా కూడా ఆఫీస్ బేరర్స్ అని లెటర్స్ ఇచ్చారని పేర్కొన్నారు. ఎంఆర్ఓ, డాక్టర్, గజిటెడ్ ఆఫీసర్స్ హోదాలో ఉన్న వారికి కూడా బదిలీల్లో మినహాయింపు కోరుతూ లెటర్స్ ఇచ్చారని తెలిపారు. ఈ అంశాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఆ అసోసియేషన్‌పై పలు ఫిర్యాదులు వెళ్లాయని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వ అధికారి సురేష్‌కుమార్ విచారణ చేపట్టారని తెలిపారు. ఇందుకు సంబంధించి విచారణ పూర్తయినంత వరకు ఏపీజీఈఏ లెటర్స్‌ను హోల్డ్‌లో ఉంచాలని కోరారు.

కేసు నమోదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని రవీంద్రనగర్‌కు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి రూ. 35 వేలు నగదును సైబర్ నేరగాడు కాజేశాడు. తనకు వచ్చిన సమాచారానికి స్పందించిన బాధితులు నిందితుడు చెప్పిన మేరకు సమాచారం లింకుపై టచ్ చేసి తన దగ్గర ఉన్న సమాచారాన్ని ఇవ్వడంతో డబ్బులను కాజేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ ఉలసయ్య తెలిపారు.